క్లుప్తంగా

భూ సర్వేతో రైతులకు మేలు



డ్రోన్‌తో సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది

మాకవరపాలెం: జగనన్న శాశ్వత భూ హక్కు పథకంలో నిర్వహిస్తున్న భూ సర్వేతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని తహసీల్దార్ ప్రసాదరావు అన్నారు. మండలంలోని పాపయ్యపాలెంలో బుధవారం డ్రోన్ సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 8 గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందన్నారు. ప్రస్తుతం జడ్.గంగవరం, శెట్టిపాలెం, బయ్యవరం, పెద్దిపాలెం, జి.గంగవరంలో సర్వే జరుగుతుందన్నారు. మిగిలిన గ్రామాల్లో డ్రోన్ సర్వే చేపట్టామని, ఇది పూర్తికాగానే రీ సర్వే ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో వీఆర్‌వో లక్ష్మణరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గింజర్తిలో 3న ఉచిత కంటి వైద్య శిబిరం

గొలుగొండ: మండలంలోని గింజర్తి గ్రామంలో ఈనెల 3న ఉచిత కంటి వైద్య శిబిరం జరగనుంది. విశాఖకు చెందిన శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి సిబ్బందితో పాటు పంచాయతీ పాలకులు తెలిపారు. చుట్టు పక్కల ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంచాయతీ కార్యాలయం వద్ద ఉదయం 9 గంటల నుండి శిబిరం జరుగుతుందన్నారు.

చురుగ్గా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

గొలుగొండ: మండలంలో చీడిగుమ్మల, గొలుగొండ, జోగుంపేట, కంఠారం, ఏఎల్‌పురం, కృష్ణదేవిపేట గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నేతలు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కన్వీనర్లు పాల్గొన్నారు.

వైభవంగా రామాలయం ప్రారంభం



రామాలయంలో పూజలు చేస్తున్న స్థానికులు

మాకవరపాలెం: మండలంలోని భీమబోయినపాలెం శివారు గండిపేటలో స్థానికుల సహకారంతో నూతనంగా రామాలయాన్ని నిర్మించారు. ఈ నేపథ్యంలో ఆలయ ప్రారంభోత్సవం వైభవంగా జరిగింది. గత మూడు రోజులుగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. అనంతరం బుధవారం ఆలయాన్ని ప్రారంభించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని సీతారాములను దర్శించుకుని ప్రసాదం స్వీకరించారు.

కంటి సమస్యలకు సకాలంలో వైద్యం పొందాలి



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కె.కోటపాడు : అవ్వా, తాతలు కంటి సంబంధిత సమస్యలకు సకాలంలో మెరుగైన వైద్యం పొందాలని శంకర్ ఫౌండేషన్ ఆప్తాల్మజిస్ట్ చందన తెలిపారు. వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం కె.కోటపాడులో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 169 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 40 మందికి వివిధ కంటి శస్త్ర చికిత్సలు అవసరంగా గుర్తించి ఉచితంగా శంకర్ ఫౌండేషన్‌లో నిర్వహించేందుకు ప్రత్యేక వాహనంలో తీసుకెళ్లారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ కార్యకర్త పైడిరాజు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌లో వైద్య పరీక్షలు

మాడుగుల రూరల్: ఎం. కోడూరు గ్రామంలో బుధవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో 67 మంది రోగులను పరీక్షించారు. కేజేపురం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్.శివప్రసాద్‌పాత్రుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక అంగన్‌వాడీ, ఎంపీపీ, హైస్కూల్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. 104 వైద్యాధికారి సురేశ్, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి

- జగనన్న పాలనలో పరుగులు తీస్తున్న ప్రగతి
- ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు ప్రచారంలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



పోలేపల్లి ప్రచారంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి పట్టభద్రులు ఓటు వేయాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ప్రభుత్వ విప్ ధర్మశ్రీ బుధవారం మండల వైసీపీ నాయకులతో కలిసి పోలేపల్లి, రాజాం, ఆర్ భీమవరం, తురకలపూడి తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి ముఖ్యమంత్రి జగనన్న నవరత్నాల పథకాలతో పాటు గ్రామ సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు, విలేజ్ క్లినిక్‌లు తీసుకొచ్చి ప్రజల అందుబాటులోకి వైద్య సేవలు తెచ్చారన్నారు. కోట్లాది రూపాయలతో నాడు-నేడు పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేశారన్నారు. ఉచిత విద్య, పుస్తకాలు, బూట్లు, బ్యాగ్‌లు అందించడమే కాకుండా అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన అందించి పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించి వారు గొప్పగా రాణించేలా పలు సంస్కరణలు చేశారన్నారు. అవినీతికి తావు లేకుండా పాలన సాగిస్తున్నారని అన్నారు. అయితే ప్రతిపక్షాలు మాత్రం ముఖ్యమంత్రిపై లేనిపోని దుష్ప్రచారం చేయడాన్ని పట్టభద్రులు గ్రహించాలన్నారు. వైసీపీ బలపరిచిన సుధాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించి కౌన్సిల్‌కు పంపించాలని.. 2024లో మళ్లీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టిస్తుందని నిరూపించాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, వైస్ ఎంపీపీలు దొండా నారాయణమూర్తి, గొంపా చినబాబు, మండల సచివాలయ కన్వీనర్ కోరుకొండ అప్పలనాయుడు, చోడవరం నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ ముచ్చకర్ల వెంకటరావు, సర్పంచ్‌లు పెదిరెడ్ల మాణిక్యం, సీతా బుజ్జి, మరిసా నాని, అమ్ముగనాయుడు, గోవింద, గంట్ల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సుధాకర్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి



పార్టీ నాయకులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం:ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్ గెలుపునకు కృషి చేయాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రుల ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన ప్రతి ఓటరును స్వయంగా కలిసి ఓటు అభ్యర్థించాలని అన్నారు. ఈ ఎన్నిక ప్రతిష్టాత్మకం అన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో తన గెలుపునకు ఏ విధంగా పని చేశారో అదే విధంగా ఎమ్మెల్సీ ఎన్నికకు పని చేయాలన్నారు. ఒక్కో నాయకుడు కనీసం వంద మంది పట్టభద్రులను కలవాలన్నారు. అనంతరం ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, మున్సిపల్ వైస్‌చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఏకా శివ, రాష్ట్ర ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ఉన్నీషాబేగం, కౌన్సిలర్లు కోనేటి రామకృష్ణ, బోడపాటి సుబ్బలక్ష్మి, బయపురెడ్డి చినబాబు, వీరమాచినేని జగదీశ్వరి, కోఆప్షన్ సభ్యులు ఎండీ బాషా, చింతకాయల వరుణ్, ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, మండల పార్టీ అధ్యక్షుడు సుర్ల సత్యనారాయణ, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గొంప కన్నయ్యనాయుడు, సర్పంచ్ బంటు నాగరాజు, గురంధరపాలెం సర్పంచ్ శానపతి వెంకటరత్నం, ఎంపీటీసీ సభ్యుడు బోళెం వెంకటేష్, మున్సిపల్ సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీనివాస్ పాల్గొన్నారు.

పశుపోషణపై పాడి రైతులకు అవగాహన కల్పించాలి



ప్రదర్శనకు వచ్చిన లేగ దూడలను పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు



మేలు జాతి దూడల రైతులకు బహుమతులు అందిస్తున్న అధికారులు

చీడికాడ: పాడి రైతులకు పశుపోషణపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి నిత్యం పశు వైద్య సేవలు అందించాలని డిప్యూటీ సీఎం, గ్రామీణాభివృద్ధి, పంచాయితీ రాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. బుధవారం మండలంలోని జైతవరంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన లేగదూడల ప్రదర్శన కార్యక్రమాన్ని పరిశీలించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాడి అభివృద్ధికి, పాడి రైతులకు ఆర్థిక భరోసా కల్పిందుకు అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నారన్నారు. ముఖ్యంగా పాడి రైతు నష్టపోకుండా పశువులు, మూగజీవాలకు సకాలంలో ఉచితంగా పలు వ్యాధి నిరోధక టీకాలు కళ్లాల వద్దే అందిస్తున్నారన్నారు. అందుకు ప్రత్యేకించి వైఎస్ఆర్ పశువైద్య సంచారశాల వాహనాలను ప్రవేశపెట్టి 24 గంటలు అత్యవసర సేవలందిస్తున్నారన్నారు. పాడి-పంట రైతుకు వెన్నుదన్నుగా ఉంటాయని నమ్మిన జగనన్న ఆ దిశగా ముందుకు సాగుతూ పాడి పరిశ్రమ ఉన్నతికి కృషి చేస్తున్నారన్నారు. ఇదిలా ఉండగా ప్రదర్శనకు వచ్చిన లేగదూడల్లో మేలు జాతి, పోషణ, ఆరోగ్యం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆయా దూడల రైతులకు జిల్లా పశుసంర్థక శాఖ సంచాలకులు బి.ప్రసాదరావు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మాడుగుల ఏడీ చిట్టినాయుడు, చీడికాడ పశువైద్యులు గాయిత్రీదేవి, సర్పంచ్ కోడూరి సత్యవతి, ఉప సర్పంచ్ ఈర్లె చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఉగాది నాటికి 354 ఇళ్ల నిర్మాణం



నాతవరంలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ జేఈ జోగారావు

నాతవరం: ఉగాది నాటికి 354 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్య నిర్దేశం చేసుకున్నట్లు హౌసింగ్ జేఈ జోగారావు తెలిపారు. బుధవారం మర్రిపాలెం, గుమ్మడిగొండ, నాతవరం గ్రామాల్లో జగనన్న లేఅవుట్లలోని ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. నిబంధనల ప్రకారం ఇళ్లు కట్టుకునే లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. మండలంలో 56 జగనన్న లేఅవుట్లలో ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిందన్నారు. అర్హత ఉండి ఇల్లు రాకపోతే సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే కలెక్టర్ మంజూరు చేస్తారన్నారు. లబ్ధిదారులకు ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు.

ఇంటి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలి



సత్యవరంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో మీనాకుమారి

మాడుగుల: వలంటీర్లు ఇంటి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలని ఎంపీడీవో మీనాకుమారి అన్నారు. మండలంలో సత్యవరం గ్రామ సచివాలయాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. శతశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులను ప్రశ్నలడిగి వారి సమాధానాలకు సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలో ఉపాధి పనులను పరిశీలించారు. కూలి గిట్టుబాటు అయ్యేలా పనులు చేపట్టాలని, హాజరు సకాలంలో వేయాలని వీఆర్‌పీ శంకర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి విశాలక్ష్మి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వెంకన్న కల్యాణోత్సవాలు



వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఉత్సవ ఏర్పాట్లు చేస్తున్న కమిటీ సభ్యులు

రోలుగుంట: ఈ నెల 7 వరకూ దేవదాయ శాఖ ఆధ్వర్యంలో స్థానిక కొండపైనున్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో కల్యాణోత్సవాలు జరగనున్నాయి. అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముత్యాలవారి కుటుంబాలు (కమిటీ) చేపట్టాయి. దీనిలో భాగంగా బుధవారం ఆలయానికి రంగులు వేయించి ఆలయ పరిసరాలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ మట్లాడుతూ గురువారం పెళ్లిరాటతో అంకురార్పణ జరుగుతుందన్నారు. 3న స్వామివారి కల్యాణం, 4,5,6 తేదీల్లో నిత్యార్చన-హోమం, 7 ఉదయం ఊరేగింపు, చక్రస్నానం, పూర్ణాహుతి జరుగుతాయన్నారు. భక్తులందరూ పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



యాగశాల ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

రాంబిల్లి : కొత్తపేటలో బుధవారం దుర్గాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, ఆలయ ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత గణపతి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యాగశాల ప్రవేశం ఇతర పూజాది కార్యక్రమాలను శాస్త్రోక్తంగా పురోహితులు నిర్వహించారు. సర్పంచ్ అరుణలత, గ్రామనాయకులు, భక్తులు పాల్గొన్నారు. ఈ నెల 3న ఆలయ ప్రారంభం, దుర్గాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

విస్తారంగా జనుము సాగు



దేవరాపల్లిలో సాగులో ఉన్న జనుము పంట

దేవరాపల్లి: మండలవ్యాప్తంగా జనుము పంటను రైతులు విస్తారంగా సాగు చేశారు. దేవరాపల్లితో పాటు రైవాడ, వెంకటరాజుపురం, వాకపల్లి, బోయిలకింతాడ, కలిగొట్ల తదితర గ్రామాల్లో రైతులు జనుము సాగు పట్ల ఆసక్తి చూపుతున్నారు. మండలంలో సుమారు 200 ఎకరాల్లో జనుము సాగవుతోంది. ప్రస్తుతం ఈ పంట పూత దశలో ఉంది. ఖరీఫ్ పంటల సాగుకు ముందు జనుమును పచ్చిరొట్ట ఎరువుగా సాగు చేసి భూమిలో కలియదున్నుతారు. తద్వారా భూమి సారవంతమై పంటల దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో రైతులు జనుము సాగు పట్ల మక్కువతో ఉన్నారు.

అంగన్‌వాడీ టీచర్ ఆకస్మిక మృతి



సత్యవతి (ఫైల్)

రావికమతం: రావికమతం 4వ కేంద్రం అంగన్‌వాడీ టీచర్ అమరకంటి సత్యవతి (40) బుధవారం ఆకస్మికంగా మృతి చెందారు. గడచిన కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెకు బంధువులు స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేయిస్తూ వస్తున్నారు. అయినప్పటికీ ఆమె ఆరోగ్యం విషమించి బుధవారం మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మండలంలోని పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి సంతాపం తెలిపారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



పింఛన్ అందజేస్తున్న కన్వీనర్ శ్రీనివాసరావు

మునగపాక : ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మలాడ సచివాలయ కన్వీనర్ సూరిశెట్టి శ్రీనివాసరావు కోరారు. మండలంలోని ఉమ్మలాడలో బుధవారం ఆయన అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అందరి హృదయాల్లో సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు పాల్గొన్నారు.

మాధవ్ గెలుపు కోరుతూ ప్రచారం



మాధవ్‌కు ఓటేయాలని అభ్యర్థిస్తున్న బీజేపీ జిల్లా నాయకుడు గాదే శ్రీనివాసరావు

నాతవరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాధవ్‌ను గెలిపించాలని బీజేపీ జిల్లా నాయకుడు గాదే శ్రీనివాసరావు అన్నారు. పార్టీ నాయకుడు లక్కోజు విక్రమ్‌తో కలిసి బుధవారం మండలంలోని హైస్కూల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాధవ్‌ను ఎమ్మెల్సీగా గెలిపించేందుకు అన్ని వర్గాల వారు మద్దతు పలుకుతున్నారన్నారు. ఆయనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు పాల్గొన్నారు.

క్రషింగ్‌కు సరిపడా చెరకు సరఫరాకు ప్రయత్నించాలి



కార్మికులతో మాట్లాడుతున్న వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రామునాయుడు

చోడవరం: క్రషింగ్‌కు సరిపడా చెరకు సరఫరా అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని షుగర్ ఫ్యాక్టరీ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శరగడం రామునాయుడు డిమాండ్ చేశారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో మందకొడిగా జరుగుతున్న క్రషింగ్ తీరుపై కార్మికులతో బుధవారం సమావేశం నిర్వహించారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి రోజువారీ క్రషింగ్‌కు కావలసినంత చెరకును సరఫరా చేయించడంలో ఫ్యాక్టరీ ముఖ్య వ్యవసాయాధికారి (సీడీవో) నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజువారీ క్రషింగ్‌కు 4 వేల టన్నుల చెరకు సరఫరా కావాల్సి ఉండగా కేవలం 2 వేల టన్నులు మాత్రమే సరఫరా చేస్తున్నందున బాయిలర్ హౌస్ నిర్వహణ సక్రమంగా జరగక ఫ్యాక్టరీకి నష్టం వాటిల్లుతోందన్నారు. చెరకు లేక బాయిలర్ హౌస్‌లో సింగిల్ యూనిట్ నిర్వహించడంతో లక్షలాది రూపాయలు ఆదాయం చేకూర్చే బెగాస్ కూడా నష్టపోవాల్సి వస్తుందన్నారు. వెంటనే యాజమాన్యం చర్యలు తీసుకోవాలన్నారు.

ముగిసిన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం



ఏకశిల ధ్వజస్తంభ ప్రతిష్టలో పాల్గొన్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తదితరులు

మాడుగుల: స్థానిక గవర వీధిలో వెలసిన వైభోగ సీతారాముల ఆలయ ప్రాంగణంలో సుమారు రూ. 10 లక్షలతో 32 అడుగుల ఏకశిలా ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు బుధవారంతో ముగిసాయి. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభాలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బూడి ఆలయ కమిటీకి రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు వైభోగ సీతారాముల వారిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధనలో సుమారు 10 వేల మంది భక్తులు పాల్గొన్నారు. ఏకశిలా ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు గత నెల 25న ప్రారంభమై బుధవారంతో ముగిసాయి. సుమారు వంద మంది దంపతులు పాల్గొన్నారు.

జేడీపేట దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ

మండలంలో జమ్మాదేవిపేట గ్రామంలో బుధవారం విఘ్నేశ్వర, సాయినాథ, దత్తాత్రేయ, కుమారస్వాముల విగ్రహాల ప్రతిష్ఠలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పాల్గొన్నారు. ఆలయ నిర్మాణంతో పాటు విగ్రహాలు ఏర్పాటు చేసిన దాత రిటైర్డ్ ఎస్ఐ సుగుణాకరరావు దంపతులను బూడి సత్కరించారు. అన్న సమారాధనలో సుమారు 5 వేల మంది భక్తులు పాల్గొన్నారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, మాడుగుల, జేడీపేట, సర్పంచ్‌లు ఎడ్ల కళావతి, కొసిరెడ్డి కృష్ణమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ శేనాపతి కొండలరావు, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, కాళింగ కళ్యాణ రాజు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. చింతలూరులో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో బుధవారం డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పాల్గొన్నారు. జాలంపల్లి పిట్టగెడ్డలో వెలసిన ఉమాభీమలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. మండలంలో గల వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎం. కోడూరులో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పూజలు చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర విగ్రహ ప్రతిష్ఠ

మాడుగుల రూరల్: మండలంలో ఎం. కోడూరు కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ బుధవారం వైభవంగా నిర్వహించారు. విశాఖ సుజాతానగర్‌కు చెందిన చర్ల సత్యనారాయణశర్మ, సత్యకాశీ అన్నపూర్ణ దంపతుల ఆర్థిక సహకారంతో ఈ ఆలయం నిర్మించారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ వేమవరపు రామధర్మజ, సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు, ఎంపీటీసీ సభ్యులు ముమ్మిన రమణబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజేశ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు చింతా వెంకటనారాయణమూర్తి, గ్రామ శాఖ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, ఆలయ ప్రధాన అర్చకులు నిష్టల లక్ష్మీనర్సింహమూర్తి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు.

టైలర్లకు అండగా ప్రభుత్వం



టైలర్లకు సామగ్రి పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు

దేవరాపల్లి: టైలర్ల సంక్షేమానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని దేవరాపల్లి మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు అన్నారు. శ్రీ ఉమామహేశ్వరీ టైలర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో టైలర్స్ డే వేడుకల్లో భాగంగా జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న చేదోడు పథకం ద్వారా టైలర్లకు ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటు అందిస్తుందన్నారు. బ్యాంక్ రుణాలు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని టైలర్లు కోరగా ఈ సమస్యలను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు దృష్టికి తీసుకెళ్లి తన వంతుగా పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు. టైలరింగ్‌కు సంబంధించిన సామగ్రి టైలర్లందరికీ అందజేసి, టైలర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు ఉప్పు శ్రీను, ఇంజరపు శ్రీను, రామకృష్ణ, మాదస శ్రీను, ప్రసాద్, దేవి, రాణి తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయ నిర్మాణానికి భూమిపూజ



తిమ్మరాజుపేటలో వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నేతలు

మునగపాక : తిమ్మరాజుపేటలో బుధవారం కలియుగ దైవం వేంకటేశ్వరుని ఆలయ నిర్మాణానికి డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవరచుకోవాలని తెలిపారు. ఆలయ నిర్మాణానికి స్థలం సమకూర్చిన శరగడం రామేశ్వరరావును అభినందించారు. డాక్టర్ విష్ణుమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, సర్పంచ్ మంగలక్ష్మి, ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, గొట్టుముక్కల వాసు, రామభద్రనాయుడు, దివాకర్, ఆడారి గణేష్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

7 వరకూ శ్రీదేవి పెద్దింటమ్మ తల్లి మహోత్సవాలు



రోలుగుంట: ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రఖ్యాతి గాంచిన రోలుగుంట మండలం కుసుర్లపూడి శ్రీదేవి పెద్దింటమ్మతల్లి మహోత్సవాలు శుక్రవారం నుంచి ఈ నెల 7 వరకూ జరగనున్నాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగులతో తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ చైర్మన్ మద్దు అప్పలనాయుడు మాట్లాడుతూ ఉత్సవాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నసమారాధన జరుగుతాయన్నారు.

ఘనంగా ముకుందపురం సీతారాముల తీర్థం

మాడుగుల రూరల్: మండలంలో ముకుందపురం గ్రామంలో సీతారాముల వారి తీర్థం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో భాగంగా స్లో బైక్ పోటీలు, ముగ్గుల పోటీ, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.